# పొరపాటు.

"ఇదిగో! ఒరే- శ్రీధరం! అబ్బాయ్, యెక్కడ్రా నువ్వు! యిలా రా! అహో్య రాజా! ఉత్తరాలు అందటం ఇంత ఆలస్యమైతే యెలాగంట! ఇలా రారా బాబూ !"

నిలువుటద్దంముందు నిలబడి కూనిరాగం తీస్తూ వొక సారి కట్టుకున్న టైని విప్పేసి, బాగా లేదని మరోసారి నిదానంగా కట్టుకుంటున్న శ్రీధర్ ఉలిక్కిపడ్డాడు. ఏదో అయింది. లేకపోతే అంత బిగ్గరగా కేకలు పెట్టలేదు. చేతిలో ఉన్న టైని టేబిలుమీద పడేసి యివతలకు వచ్చాడు. అప్పటికే గది గుమ్మం దగ్గరకు వచ్చేసింది బామ్మగారు. ఆవిడ చేతిలో ఉత్తరం వుంది. మనిషి మహా ఖంగారుగా వుందని తలమీద నుంచి జారిపోయిన కొంగే చెప్తోంది.

"ఏమిటది! ఎక్కడ్నుంచి ఉత్తరం!" అన్నాడు శ్రీధర్ తనుగూడా ఆదుర్దాపడుతూ.

"జయలక్ష్మి వస్తున్నానని ఉత్తరం రాసింది రాచూడు, మొన్న సాయంత్రం అందవలసిన ఉత్తరం యిది. ఇప్పుడు

అందింది. ఈ సాయంత్రం కాయకే వస్తోందట. ఒక్కత్తి— ఇదే మొదటిసారి రావటం, యెంత ఇబ్బంది పడేదీ! సయం, ఇప్పుడైనా అందింది. అదే పదివేలు. నువ్వు కొంచెం కారుదగ్గరకు వెళ్ళిరా."

"ఇప్పుడా! నేనా!" శ్రీధరు ఆగిపోయాడు.

"అవును నువ్వే. లేకపోతే నేను వెళ్తానా ఏమిట్రా! యెలాగూ తయారయివున్నావు పద, పద. ఆ కాస్త కాఫీ తాగివెళ్ళు- కారు ఎప్పుడొస్తుందో ఏమిటో! పిచ్చి పిల్ల! కారు దగ్గరకు యెవరూ రాకపోతే ఖంగారు పడిపోతుంది. రా, రా!" వచ్చినంత వేగంగా ఆవిడ తిరిగి వెళ్ళిపోయారు.

శ్రీధరు అలాగే నిలబడిపోయాడు. ఇప్పుడెలా? ఈ రోజు క్లబ్ మీటింగ్ వుంది, అందుకే గబగబా తయారవుతున్నాడు. ఈ సంవత్సర వార్షికోత్సవానికి జరపబోయే యేర్పాట్లగురించి చర్చించాలి. అందులో ఈరోజు మాట్లాడవలసింది అందరికంటే తనే ముఖ్యం. వెళ్ళకపోతే ప్రెసిడెంటుకి కోపంగూడా వస్తుంది. యేలా? యేది దారి? అనుకుంటూ వెనక్కి తిరిగివచ్చి టేబిల్ మీద పడేసిన టైతీసి కట్టుకోసాగాడు. అమ్మ భాషలో వీల్లేదు-కాదు అనే పదార్థాలకి అర్థంకాని, విలువ గాని లేవు. "నా లేటికి టైమయింది. క్లాసుకి ఆలస్యంగా వెడితే పిల్లలు గోల చేస్తారమ్మా త్వరగా భోజనంపెట్టి పంపు" అంటే "ఆగరా! ఆదరా బాదరా తింటే ఆరోగ్యం పాడైపోదూ! అది లేకపోతే ఇహ బతుకేముంది గనక? ఆరోగ్యంకోసం దేన్నయినా నిర్లక్ష్యం చెయ్యొచ్చుకాని, ఇంకో దానికోసం దాన్ని నిర్లక్ష్యం చేసు

కుంటారా! యీ తాతగారు యెప్పుడూ 'ఆరోగ్యమే మహాభాగ్యమే అమ్మడూ' అంటూండేవారు. పాపం! చచ్చి ఏ లోకాన వున్నారో కాని" అలా అంతం అవుతుంది సంభాషణ. యిహ తప్పదు, ఊరోళ్ళ వెళ్ళాలి. రేపు ప్రెసిడెంట్‌కి క్షమాపణ చెప్పుకోవాలి. అయినా ఆర్నెల్లనుంచీ వస్తావస్తా అని రాసిన ఆ జయలక్ష్మి యిప్పుడే రావాలి తన ఖర్మ కాకపోతే? 'జయలక్ష్మి వస్తుందిరా, జయలక్ష్మి వస్తుందిరా' అని బామ్మ చెప్పటం తను ఆర్నెల్లనుంచీ వింటూనే వున్నాడు. అసలిదెక్కడి చుట్టరికమో మరి! బామ్మ ఆడపడుచుకి-మనుమరాలికి తోడికోడలు చెల్లెలుట. యేదో పెళ్ళిలో చూసిందట. అప్పట్నుంచీ జయలక్ష్మికోసం బామ్మ ఒకటే కలవరింత. ఆవిడకికూడా యీ విడంటే చాలా యిష్టంట. పోనీ యిష్టం వుంటేవుంది, వస్తేవచ్చింది. మధ్య తన ప్రాణాలమీదకు తెచ్చింది. అద్దంలో ప్రతిబింబాన్ని గమనిస్తూ టైనాట్ బిగిస్తున్న శ్రీధరు హఠాత్తుగా ఆగిపోయాడు. మరుక్షణంలో యేదో మెరుపులాటి ఆలోచన కలిగినట్టు కళ్ళు తళుక్కుమన్నాయి 'ఆ' అదీ అనుకుంటూ టై అలా పట్టుకుని గబగబా వంటయింటి దగ్గరికి పరుగెత్తుకొచ్చాడు. వంటయింట్లో బామ్మగారు వంట హడావిడిలో వుండి శ్రీధర్ని గమనించలేదు. వంటయింటి గుమ్మంమీద చేయివేసి లోపలికి తొంగిచూస్తూ "బామ్మా! మరి నేనెప్పుడూ ఆవిడను చూడలేదు-యెలా గుర్తుపట్టటం? శంభుగారు తెస్తాడు. కాస్త నువ్వు వెద్దు"అన్నాడు.

"మంచివాడవే! ఉదయనుంచీ ఉపవాసం వుండి

దీక్షతో ఉన్న నేను ఆ వెధవ కారెక్కి మైలపడమంటావా? గుర్తులకేం? నేను చెప్తానుగా-రా! యీ గ్లాసు కాఫీ తాగేసెయ్యి" అంది పొగలు గక్కుతున్న వెండి కాఫీ గ్లాసుతో యిస్తూ.

"చెప్పుమరి" అన్నాడు శ్రీధర్ హుశారుగా, పాంట్ జేబులోంచి జేబురుమాలు తీసి గ్లాసు పట్టుకుంటూ.

ఆవిడకి యెన్నిసార్లు చెప్పినా అంతే. వెండిగ్లాసు వద్దు మొర్రో కాల్తుంది అంటే 'ఛ, అదేమిటా గతిలేని వాడిలా గాజు కప్పుల్లో తాగటం ఏమిటి? అంత కాల్తుంటే చల్లారబోసుకుని తాగాలి కానీ' అంటుంది. ఆవిడకు చెప్పి వాదించటం యిష్టంలేని శ్రీధర్ ఆవిడ చూడకుండా గాజు గ్లాసులోనో, కప్పులోనో పోసుకు తాగేవాడు.

"చూడు. మనిషి పచ్చగా, పసుపుముద్దలావుంటుంది. నీ భుజాల దగ్గరికి వచ్చే యెత్తుంటుంది" వర్ణన మొదలు పెట్టినిది ఆవిడ.

ఇది బాగుంది. పోనీ రంగంటే యెలాగో తెలుసుకోవచ్చు. కానీ యెత్తెలా? ప్రతి ఆడవాళ్ళ దగ్గరకూ వెళ్ళి ప్రక్కన నిలబడి యెత్తు తేల్చుకోవాలి కాబోలు. కొంచెం చురుకైన ఆడపిల్ల అయితే, అలా చేస్తే చెంపలు శుద్ధిచేసి పంపిస్తుంది- అనుకున్నాడు శ్రీధర్.

"పెద్దజడ- అంత లావుకాదు, అంత సన్నంకాదు. సరిసమానంగా వుంటుంది కళగల మొహం. కళగలమొహం అంటే? ప్రతివాళ్ళకి ఏదో కొంత కళ వుండకపోదు. కాక

పోతే కొంతమంది మొహాలు విద్యుద్దీపాల్లా వుంటే, మరి కొంతమందివి ఆముదం దీపాల్లా వుంటాయి మరీ కొంతమందివి ఆరిపోతున్న దీపాల్లా వుంటాయి.

బామ్మగారి వర్ణన పూర్తి కాలేదు. "చక్కని చుక్కలా వుంటుంది" చేతిలో మిఠాయి పొట్లం కూడా వుంటుందా అనుకున్నాడు శ్రీధర్.

"దాందంతా మా చచ్చిపోయిన పిన్నత్తగారి పెత్తల్లి కూతురు పోలికలే అయినా సోద్యం కాకపోతే- అసలు బెజవాడ పిల్లలు చూస్తూనే తెలిసిపోరుట్రా, నీదంతా మరీ విచిత్రం కాకపోతే!" తరుగుతున్న అరటికాయ ముక్కలు నీళ్ళలో పడేస్తూ శ్రీధరువంక చూస్తూ అంది. జయలక్ష్మి వస్తోంది అన్న ఉత్సాహం ఆవిడ మొహంలో స్పష్టంగా కన్పిస్తోంది.

"బావుంది! బెజవాడ అమ్మాయి- హైద్రాబాదు అమ్మాయి అని మొహంమీద రాసుంటుందా బామ్మా! యేమోబాబూ! నీ వర్ణనలు ప్రకారం కళగల మొహం. పెద్ద జడమ్మాయి, పసుపుకొమ్ము రంగున్న మనిషి ఐతేనే తీసుకొస్తాను, లేకపోతే నిజం జయలక్ష్మి వచ్చినా తీసుకు రాను. నువ్వు మా బామ్మచెప్పిన అమ్మాయివి కాదు అని వదిలిస్తే, ఆపైన నీ యిష్టం" అంటూ శ్రీధర్ యివతలకు వచ్చేశాడు.

బైట వరండాలో తనకోసం యెదురుచూస్తున్న శంభుకి తను క్లబ్ కు రాలేనందుకు చింతిస్తూ, శుమూర్పణ కోరుకుంటూ రేపు ఉదయం తప్పకుండా కలుస్తానని వాగ్దానం

చేస్తూ రాసిన చీటియిచ్చి సైకిల్ మీద వెళ్ళి ఇచ్చిరమ్మన మని పంపి తను కారు దగ్గరికి బయలుదేరాడు.

శ్రీధర్ వెళ్ళిన పది నిమిషాలకు కాని బెజవాడనుంచి వచ్చే కారు రాలేదు. నిన్నటివరకూ ఆ కారు రాత్రి పది గంటలకు వస్తుందట. కానీ ఆరోజు సరిగా టైమ్‌కే వస్తుంది. 'అదృష్టమే, త్వరగా వచ్చేస్తే యింటిదగ్గిర దింపేసి తను క్లబ్‌కు పోవచ్చు' రిస్టువాచీ చూసుకుంటూ కారుకోసం ఎదురుజూస్తున్నాడు శ్రీధర్.

కారు వచ్చింది. అందులోంచి అలసిపోయిన ప్రయాణీకులు హడావిడిగా దిగుతున్నారు. కొంతమంది హడావిడిగా దిగుతున్నారు, కొంతమంది సామానులు చూసుకుంటున్నారు. ఇంకా కొంతమంది తనకోసం వచ్చినవాళ్ళని చూసుకుంటున్నారు. కారుకి కొద్దిదూరంలో నిలబడి దిగబోయే ఆడవాళ్ళకోసం చూస్తున్నాడు శ్రీధర్. అందులోంచి యిద్దరే ఆడవాళ్ళు దిగారు. ఇద్దరిలో ఒకావిడ వయసు మళ్ళిన సువాసిని. మరో అమ్మాయికి 20 సంవత్సరాలు నిండీ నిండనట్లున్నాయి. వాళ్ళిద్దరూ తల్లీ కూతుళ్ళేమో! కారులో యింకెవరైనావున్నారేమోనని చూస్తున్న శ్రీధర్‌కి కారులో ఎవరూ కనిపించకపోగా క్రిందకు దిగిన యిద్దరిలో పెద్దావిడ తన కోసం వచ్చిన ముసలాయనకి మర చెంబు యిస్తూ "వెళ్ళొస్తానమ్మా" అనటం, ఆ అమ్మాయి ఏదో ఆదుర్దాగా చూస్తూ "ఊ" అని తలూపటం కనిపించింది. కొంచెం దగ్గిరగావచ్చి ఆ అమ్మాయిని పరీక్షగా చూశాడు శ్రీధర్. యెవరికోసమో వెతుకుతున్నట్లు నిలబడ్డ

ఆ అమ్మాయి శ్రీధర్ని గమనించలేదు. మరికొంచెం దగ్గరగా వచ్చి బాగా చూశాడు. అచ్చు బామ్మ వర్ణించినట్లు అక్షరాలా లేదుగానీ, యించుమించు అలాగే వుంది. అందమైన కళ్ళు, కాంతిగల రంగు, చక్కని వంపుల్తో కావాలని శ్రద్ధగా మలచినట్లున్న శరీరం—బామ్మ చెప్పినవాటిల్లో ఒకటి మాటుకు స్పష్టంగా తెలుస్తుంది. అది ఆ అమ్మాయి జడ! తాచుపాము వెన్ను పూసని అంటుకున్నట్లుగా వుంది. "మీ పేరు?" అన్నాడు శ్రీధరు, అప్పుడే కళ్ళుతిప్పి తనని గమనిస్తున్న ఆ అమ్మాయి నుద్దేశించి. "లక్ష్మి" అంది ఆ అమ్మాయి బెదురుకళ్ళతో శ్రీధర్ని చూస్తూ.

"గుడ్! యింత సులభంగా తెలుస్తారనుకోలేదు. మీ ఉత్తరం ఈ సాయంత్రమే అందింది. లేకపోతే చాలా ఇబ్బంది పడేవాడు" చురుకుదనాన్ని నింపుకున్న ఆ కళ్ళలో ఏదో శక్తి శ్రీధర్ని సరిగా మాట్లాడలేకుండా చేసింది. మొదట్లో తెలబోయినట్లు భయపడ్డట్లు కన్పించినా, ఆ అమ్మాయి త్వరలోనే సర్దుకునివచ్చి శ్రీధరుతో కారులో కూర్చుంది.

'ఎలాగైనా-బెజవాడ పిల్లల్ని గుర్తుపట్టటం తేలికే! బామ్మగారి మాటల్ని తనమాటలుగా చెప్పుకున్నాడు శ్రీధర్ డ్రైవ్ చేస్తూ. రోడ్లనీ, లైట్లనీ వేగంగా పాకిపోతున్న కార్లనీ వింతగా పరికిస్తున్న ఆ అమ్మాయి ఒకసారిపళ్ళుతళుక్కుమనేట్లు నవ్వి మళ్ళీ గంభీరంగా కూర్చుంది. చాలా కొత్తలా వుంది. బామ్మ చెప్పినంత మాటకారిలా లేదే! ఫర్వాలేదు. యీ మూగతనం రేపీపాటికి వదిలిపోదూ! ఇలాంటి అమ్మాయిని పక్కనకూర్చోబెట్టుకుని డ్రైవ్ చేస్తుంటే ఎంత బాగుంది!

శ్రీధర్‌కి యీ అనుభవం కొత్తగావుంది. యాంత్రికంగా అతని చేతులు స్టీరింగ్‌ని తిప్పుతూంటే మనసుమాత్రం ఎక్క-డెక్కడో తిరగసాగింది. అతను ఆ అమ్మాయితో గోల్కొండ వెడుతున్నాడు. సాలార్‌జంగ్ మ్యూజియం చూస్తున్నాడు. గండిపేట రిజర్వాయరు దగ్గిరున్న మెట్లమీద నిలబడి రాతి కడ్డీలను పట్టుకుని ధన్‌ధన్‌మని శబ్దంచేస్తూ పడుతున్న నీళ్ళని చూస్తున్నాడు ఆఖరికి-ఓరోజు రాత్రి బాగా 10 గంటలు దాటింతర్వాత కారులో అలా తిప్పుకొస్తానని తీసుకెళ్ళి యూనివర్సిటీ లాన్స్‌వైపు వెడుతూ డ్రైవ్ చేస్తూచేస్తూ మధ్యలో నెమ్మదిగా తను చెయిజాచి ఆ అమ్మాయి చేయి తన చేతిలోకి తీసుకుని "లక్ష్మీ! నేనెంత అదృష్టవంతుణ్ణి" అంటున్నాడు. ఆ అమ్మాయి అప్పుడు తన చేతిలోవున్న చెయ్యి తీసేసుకుని చప్పున సిగ్గుతో రెండుచేతుల్లో మొహం దాచుకుంటోంది. ఇద్దరిమధ్య ఓ అందమైన నిశ్శబ్దం యేర్పడింది. ప్రపంచం యెంత సుందరంగా వుంది. గాలి చక్కగా వీస్తోంది. యెంత బాగుంది శ్రీధరు గట్టిగా వూపిరిపిల్చి వదిలాడు. అరె! అప్పుడే యిల్లు వచ్చేసిందే. అతనికి తెలియకుండానే అతని చేతులు కారుని యింటికి తీసుకొచ్చేశాయి.

వరండా మెట్లముందుకు వచ్చి కారు కుదుపుతో ఆగింది. కారుదిగిన ఆ అమ్మాయి ఒక్క పరుగులో లోపలకు వెళ్ళింది. నవ్వుకుంటూ వెనకవస్తున్న శ్రీధర్ ఆ చుట్టుప్రక్కల బామ్మగారి శబ్దం వినిపించకపోవటం చూసి "బామ్మా! మీ లక్ష్మి వచ్చింది" అని కేకవేశాడు. ముందుకు పరుగెత్తబోతున్న ఆ అమ్మాయి హఠాత్తుగా ఆగి

వెనక్కు తిరిగి శ్రీధర్ వంక చూసింది. శ్రీధర్ యింకా నవ్వుతూనే వున్నాడు. ఇ తలలో జారిపోతున్న కొంగుని తలమీద సరిచేసుకుంటూ బామ్మగారే యివతలకు వచ్చారు. "ఇదుగో నీ లక్ష్మి సరేనా?" పాంట్ జేబులో చెయ్యిపెట్టుకొని ఠీవిగా చూస్తూ అన్నాడు.

ఆప్యాయంగా కౌగలించుకుంటారో, కన్నీరు కార్చు కుంటారో అని యెదురుచూస్తున్న శ్రీధరుకి ఆశాభంగం అవటమే కాకుండా తలమీద పిడుగు పడ్డట్టుగా "యెవర్రా యీ అమ్మాయి? మన జయలక్ష్మి రాలేదూ?" అన్నారు బామ్మగారు. బొమ్మలా నిలబడిపోయిన లక్ష్మి కదలిక తెచ్చు కుంటూ "సుజాతా వాళ్ళ యిల్లు కాదూ యిది? సుజాత మరిది కాదూ?" అంది శ్రీధరు దగ్గరగా వచ్చేసి బామ్మగారివంక భయంగా చూస్తూ.

"సుజాత యెవరూ? ఎవరి మరిదిని నేనూ?" తెల్ల బోయిన శ్రీధరు అస్పష్టంగా గొణుక్కున్నాడు.

ఆ అమ్మాయి క్షణంసేపు శ్రీధరు కళ్ళలోకి జాలిగా చూసింది. మరుక్షణం కళ్ళలో నీళ్ళు నిండబోయి ఆగిపోయి నాయి. తనని తను తమాయించుకుని తేరుకున్నట్లుగా చూస్తూ "పొరపాటయి వుండాలి. ఇది మలక్ పేట కాదూ? ఆగండి, అడ్రస్ వుండాలి" అంది పర్సులో గబగబా కాగితం కోసం గాలిస్తూ.

"లేదు, నారాయణ్ గూడ" అన్నాడు శ్రీధరు రెప్ప వాల్చకుండా ఆ అమ్మాయిని చూస్తూ. ఎవరీ అమ్మాయి ఎందుకిలా వచ్చింది? క్షణం క్రితం తనని అందమైన వ్యూహా

సార్వభౌముణ్ని చేసింది. ఇప్పుడు కాలదన్నేస్తోంది. అనుకున్నాడు. రెండు నిమిషాల్లో పర్సులోంచి అడ్రస్ కాగితం తీసి చూపింది. అడ్రస్ పేరు మొదటిదే వుంది. మలక్ పేట క్వార్టర్సు.

తర్వాత కొద్దిసేపటికి తనను చెందని, తన యింటికి రాన్ని ఆ అమ్మాయిని పక్కన కూర్చోపెట్టుకుని ఆ అడ్రస్ వెతుక్కుంటూ అంత రాత్రివేళ బైలుదేరాడు శ్రీధరు. పోనీ యెవరైనా, ఆ రాత్రి వుండిపొమ్మంది భామ్మగారు. కానీ ఆ అమ్మాయి వినలేదు.

ఆ అమ్మాయి బెజవాడనుంచి స్నేహితురాలి దగ్గిరకు వచ్చింది. వస్తున్నానని రాసిన ఉత్తరం అసలు వాళ్ళకి అందనేలేదు. అందుకే సుజాత తన మనిదిని కారుదగ్గరకు పంపలేకపోయింది. ఆ స్నేహితురాలు, స్నేహితురాలి మొగుడు ధన్యవాదాలతో, కృతజ్ఞతా వాక్యాలతో శ్రీధర్ని వుక్కిరి బిక్కిరి చేసేశారు. జరిగినదంతా చెప్పి క్షమార్పణ కోరుకున్నాడు. శ్రీధరు తీరా వచ్చెయ్యబోతుండగా ఆఅమ్మాయి యివతలకువచ్చి "నాపేరు విజయలక్ష్మి పేరుకూడా ఒకటి అవటంవల్ల ఇలా అయింది. ఈ అనుభవాన్ని ఎప్పుడూ మర్చిపోలేను. మిమ్మల్నికూడా" అంది చిలిపిగా నవ్వుతూ చేతులు జోడించి నమస్కారంచేసి సెలవు తీసుకుంటూ. "నేనుకూడా" అన్నాడు శ్రీధర్ స్వచ్ఛంగా తళతళలాడ్తూ పసితనం నింపుకున్న కళ్ళలోకి లోతుగా ఆఖరిసారిగా చూస్తూ.

శ్రీధరు యింటికొచ్చేసరికి సన్నగా దారంలా టి.బి. పేషెంటులా వుండి. పీచుల్లాంటి రెండు జడలతో మొహాన పెద్దగా వున్న యింత బొట్టుతో, పాలిపోయినట్లున్న తెలుపు రంగుతో వున్న అమ్మాయిని కూర్చోబెట్టి బామ్మగారు యిల్లెగిరి పోయేటట్లు నవ్వుతోంది. "ఇదుగోరా జయలక్ష్మి! యెవరిదో చిన్నకారు వస్తుంటే వచ్చింది" అన్న బామ్మగారి వాక్యాలు శ్రీధరుకి వినిపించలేదు

అతనికేదో గొప్ప అనుభవం అందబోయి జారిపోయి దురదృష్టవంతుడని వెక్కిరించినట్లయింది. యెంతో అందంగా రంగులు ఏరి ఓపిగ్గా కట్టుకున్న పూలమాలని తెంపి పువ్వులు చిందరవందరగా గిరాటుపెట్టినట్లు, అందంగా బొమ్మ వేద్దామని కాగితం తీసుకుని రంగులు కలుపుకుంటూ వుంటే యేదో దురదృష్ట శక్తి వచ్చి ఆ రంగులు తన్నేసి, ఆ కాగితాన్ని చించేసి, వికటాట్టహాసం చేసినట్లు అనిపించింది. నిట్టూర్పు విడిచి తన గదిలోకి వెళ్ళిపోతూ 'యెక్కడ విజయలక్ష్మి? యెక్కడ జయలక్ష్మి! ఒక్క 'వి'లో యెంత తేడా?' అనుకున్నాడు. ఒక్కోసారి అంతే! జీవితంలో మనం ఆశించని సంఘటనలు మనకు లభించి మనని ఉక్కిరిబిక్కిరి చేస్తాయి.